

హైవేల నిర్మాణం వేగవంతం

జిల్లా పరిధిలోని జాతీయ రహదారి నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. 8లో



రోగులకు మెరుగైన వైద్యసేవలు

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశించారు. 8లో



సువర్ణ కాంతులు

డుంబ్రిగుడ: తొలిపొద్దు వేళ సువర్ణకాంతులతో ఆకట్టుకున్న ఈ అద్భుత దృశ్యం గురువారం డుంబ్రిగుడలో ఆవిష్కృతమైంది.

న్యూస్‌రీల్

నేడు అంబేడ్కర్ వర్ధంతి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం పది గంటలకు స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయనతోపాటు నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ పార్టీ పదవుల్లో ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోరింది.

ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయండి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం
- గిరిజన మ్యూజియంలో నూతన బోటు ప్రారంభం



నూతన బోటులో విహరిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక గిరిజన మ్యూజియంలో పర్యాటకుల విహరించేందుకు అందుబాటులోకి తెచ్చిన హంస రూపంలో బోట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విహరించారు. అనంతరం ఆయన మ్యూజియంలో పరిసరాలను పరిశీలించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను ఎటువంటి పరిస్థితుల్లోనూ మ్యూజియంలోకి అనుమతించరాదని సూచించారు. అనంతరం పద్మాపురం గార్డెన్‌ను సందర్శించారు. అక్కడ విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను పరిశీలించారు. వీటిని త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం పర్యాటకులు విహరించారు. హంసపై కూర్చుని విహరించినట్టుగా అనుభూతి పొందారు. గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళీ, పద్మాపురం గార్డెన్ మేనేజర్ లకే బొంజుబాబు పాల్గొన్నారు.


మత్స్యగుండాన్ని అభివృద్ధి చేస్తాం



మత్స్యలింగేశ్వర స్వామిని దర్శించుకున్న పీవో అభిషేక్

హుకుంపేట: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం మత్స్య గుండం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. గురువారం ఆయన మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మత్స్యగుండం పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. మఠం జంక్షన్ నుంచి మత్స్యగుండం వరకు రూ.4కోట్ల 50లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మఠం శాంతకుమారి, ఆలయ కమిటీ సభ్యులు మత్స్యకొండబాబు, గోపాలపాత్రుడు, రాంబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

కొయ్యూరు: సీపీఐ మావోయిస్టుల 24వ పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నాయకులు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంప ఎస్‌ఐ శంకర్‌రావు, కొయ్యూరు ఎస్‌ఐ కిషోర్‌వర్మ వాహన తనిఖీలు చేపట్టారు. కొత్త వ్యక్తుల వివరాలు తెలుసుకుని విడిచిపెడుతున్నారు.

● మూగజీవాల విలాపం

మన్యం టూ హైవే

కబేళాలకు తరలిపోతున్న పశు సంపద



మినీ వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు

- తరలివస్తున్న తెలుగు రాష్ట్రాల్లోని కబేళా వ్యాపారులు
- మకాం వేసి వారపు సంతల్లో కొనుగోళ్లు
- బహిరంగంగా తరలిస్తున్నా పట్టించుకునేవారే కరువు

మన్యం నుంచి పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోం ది. వారపు సంతల్లో కొనుగోలు చేసిన పశువులను పథకం ప్రకారం జాతీయ రహదారి వరకు తీసుకువెళ్లి, అక్కడినుంచి తెలుగు రాష్ట్రాల్లోని కబేళాలకు తరలిస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

సాక్షి,పాడేరు: మన్యంలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన కబేళా వ్యాపారులంతా ఏజెన్సీలో ఇప్పటికే మకాం వేశారు. స్థానిక దళారీ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి తరలిస్తున్నారు. వ్యవసాయ పనులు లేక పోవడంతో, గిరిజన రైతులు కూడా డబ్బు అవసరాల నిమిత్తం ఆవులు, గేదెలను వారికి అమ్ముతున్నారు.

- గత మూడు వారాల నుంచి ఏజెన్సీ వ్యాప్తంగా పశువుల వ్యాపారం భారీగా జరుగుతోంది. గతంలో పశువులను అక్రమంగా కబేళాలకు తరలించే వ్యాన్లు, లారీలను పోలీసులు పట్టుకునే వారు. ప్రస్తుతం వారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ఏజెన్సీలోని కాశీపట్నం, డముకు, సుంకరమెట్ట, అరకు, కించుమండ, హుకుంపేట, గుత్తులపుట్టు, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, అన్నవరం, లోతుగెడ్డ జంక్షన్‌లో జరిగే ప్రధాన వారపు సంతల్లో పశువుల వ్యాపారం భారీగా జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు కొనుగోలు చేసే పశువులన్నీ తెలుగు రాష్ట్రాల్లోని పశుమాంసం విక్రయించే కబేళాలకు తరలిస్తున్నారు. పెద్ద లారీలు, వ్యాన్లతో పాటు మినీ వ్యాన్లలోను భారీగా అక్రమ రవాణా జరుగుతోంది.

రైతుల ముసుగులో..

- మైదాన ప్రాంత రైతుల ముసుగులో కొనుగోలు చేసిన పశువులను ఎవరికి అనుమానం రాకుండా మినీ వ్యాన్ల ద్వారా నక్కపల్లి, తుని ప్రాంతంలోని జాతీయ రహదారులకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి సమయంలో పెద్ద లారీల ద్వారా రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ ప్రాంతాల్లోని కబేళాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.
- ప్రతీ వారపుసంతల్లో రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పశువుల వ్యాపారం జరుగుతోంది. గురువారం పాడేరు మండలం గుత్తులపుట్టు సంతకు వ్యాపారులు పశువులను భారీగా తీసుకువచ్చారు. వీటిలో సుమారు 400 వరకు పెద్ద వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ పశువులన్నింటిని వ్యాన్లలో మైదాన ప్రాంతానికి తరలించారు.
- కొంతమంది వ్యాపారులు తెలివిగా కూలీల సాయంతో పాడేరు ఘాట్‌రోడ్డు జంక్షన్ ప్రాంతానికి కాలినడకన తీసుకువెళ్లే ఏర్పాట్లు చేసుకున్నారు. అక్కడి నుంచి ఏజెన్సీలోని లోతుగెడ్డ, లంబసింగి, డౌనూరు, పాడేరు, సుంకరమెట్ట చెక్ పోస్టుల మీదుగా జాతీయ రహదారి ప్రాంతాలకు పథకం ప్రకారం తరలిస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినప్పటికీ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు.



గుత్తులపుట్టులో గురువారం జరిగిన వారపు సంతకు భారీగా తీసుకువచ్చిన ఆవులు

కబేళాలకు తరలింపు అన్యాయం



ఏజెన్సీలో గిరిజన రైతుల డబ్బు అవసరాలను అడ్డం పెట్టుకుని కబేళా వ్యాపారులు పశువుల వ్యాపారాన్ని ప్రోత్సహించడం దారుణం. మైదాన ప్రాంతాల్లోని గోవధను నియంత్రించే విధంగా పోలీసు యంత్రాంగం అక్రమ పశువుల రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

– రామకృష్ణ పరమహంస, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, పాడేరు

చర్యలు తీసుకుంటాం



ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు పశువుల అక్రమ రవాణా, కబేళాలకు తరలింపుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. దీనిలో భాగంగా పోలీసు బృందాలను అప్రమత్తం చేస్తాం. వారపుసంతలతో పాటు ప్రధాన రోడ్లలో వాహన తనిఖీలు చేపట్టి పశువుల అక్రమ రవాణాను నిరోధిస్తాం. సంబంధిత కబేళా వ్యాపారుల పైన చర్యలు ఉంటాయి.

– కె.ప్రమోద్, డీఎస్పీ, పాడేరు

జెన్‌కో క్రీడాకారులకు అభినందన



ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందిస్తున్న చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు

మోతుగూడెం: విజయనగరంలో నవంబర్ 25 నుంచి 27 వరకు నిర్వహించిన ఇంటర్ సర్కిల్ టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచిన ఏపీ జెన్‌కో లోయర్ సీలేరు క్రీడాకారులను చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు అభినందించారు. లోయర్ సీలేరు స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ బి.బాలకృష్ణ సమక్షంలో గురువారం వారు చీఫ్ ఇంజనీరును మర్యాదపూర్వకంగా కలిశారు. డబుల్స్‌లో లక్ష్మణరావు, కృష్ణకుమార్ తృతీయ, సింగిల్స్‌లో లక్ష్మణరావు ద్వితీయస్థానంలో నిలిచారు. రత్నాకర్, కిరణ్‌తో కలిసి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో తృతీయస్థానంలో నిలిచారు. డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే ఆల్ ఇండియా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఏపీ ఎలక్ట్రిసిటీ జట్టుకు కెప్టెన్‌గా లక్ష్మణరావు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. లోయర్ సీలేరు క్రీడాకారిణి పి పూర్ణిమ, చెన్నైలో జరిగిన ఆల్ ఇండియా షటిల్ టోర్నమెంట్‌లో సింగిల్స్‌లో గోల్డ్‌మెడల్ ధించారు. నవంబర్‌లో అసోంలో జరిగిన ఆల్ ఇండియా ఉమెన్ టోర్నమెంట్‌లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం, డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈసీ చిన్నకామేశ్వరరావు, ఈఈ వరప్రసాద్, ప్రసాద్, స్పోర్ట్స్ సెక్రటరీ సతీష్ రాఘవన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



రంపచోడవరంలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పశ్రీ



రాజవొమ్మంగిలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉపాధ్యాయులు



కూనవరంలో పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్

ఏజెన్సీలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల్లో 88.70 శాతం పోలింగ్ నమోదు అయింది. ఎటపాక మండలంలో నూరుశాతం ఓటుహక్కును వినియోగించుకున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

– సాక్షి నెట్‌వర్క్ 8లో

కాఫీ ఫలసాయానికి గిట్టుబాటు ధర

- పండ్లు కిలో రూ.44, పాచ్‌మెంట్ రూ.285
- కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడి

సాక్షి,పాడేరు: గిరిజనులు పండించిన కాఫీ పండ్లు, కాఫీ పాచ్‌మెంట్ గింజలకు గిట్టుబాటు ధర చెల్లిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఎఫెక్స్ కమిటీ నిర్ణయం మేరకు కాఫీ పండ్లను కిలో రూ.44, పాచ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.285 చొప్పున కొనుగోలు ధరలు అమలుచేస్తామన్నారు. ఈ ఏడాది 2వేల టన్నుల కాఫీ పండ్ల సేకరణ లక్ష్యమన్నారు. జీసీసీ అధికారులు నేరుగా గ్రామాల్లోని రైతుల వద్దకు వెళ్లి కాఫీ గింజలను కొనుగోలు చేస్తారని తెలిపారు. వారపుసంతల్లో పార్చిమెంట్ తేమ పరిశీలనకు నామమాత్రం రుసుముంతో స్టాళ్లు ఏర్పాటుచేస్తామన్నారు. తేమశాతం పరిశీలన తరువాతే కాఫీ గింజలను విక్రయించాలని ఆయన రైతులను కోరారు.

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు

- అవసరం అయితే పీడీ యాక్టు అమలు
- జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మహారాణిపేట: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్రలోని జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులతో జరిగిన ప్రాంతీయ సదస్సులో వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత సజావుగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. బుకింగ్ దగ్గర నుంచి కొనుగోలు ముగిసే వరకు రైతులకు ప్రతి విషయం తెలియపరచాలని, 48 గంటల లోపే రైతు ఖాతాలో నగదు జమవుతుందన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని, రైతులు, అధికారులతో కూడిన కమిటీని నియమించుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. 6ఏ కేసులు నమోదు చేయటంతో పాటు పీడీ యాక్ట్‌ను ప్రయోగించాలని సూచించారు. దీపం–2 పథకంపై అధికారులు మరింత ఫోకస్ పెట్టాలని పేర్కొన్నారు. గ్యాస్ బుకింగ్, డెలివరీ ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ వీర పాండ్యియన్, ఎండీ మంజిల్ జిలానీ, విశాఖ జేసీ కె.మయూర్ అశోక్, అనకాపల్లి జేసీ జాహ్నవి, విజయనగరం జేసీ సేతుమాధవన్, మన్యం జేసీ శోభిక, అల్లూరి జేసీ అభిషేక్, శ్రీకాకుళం జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, ఉత్తరాంధ్ర జిల్లాల సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్, వ్యవసాయ శాఖ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నుంచి పాల్గొన్న మంత్రి, సీఎస్

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించగా విశాఖ కలెక్టరేట్ నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, కలెక్టర్ హరేందిర ప్రసాద్ భాగస్వామ్యమయ్యారు. ఇప్పటివరకు చేసిన ధాన్యం కొనుగోలు వివరాలను వారు ముఖ్యమంత్రికి వివరించారు.

నేల సంరక్షణతోనే అధిక దిగుబడి

చింతపల్లి ఏడీఆర్ అప్పలస్వామి



మాట్లాడుతున్న ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో అధిక దిగుబడులు సాధించడానికి నేల సంరక్షణ ఎంతో అవసరమని చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి సూచించారు. గురువారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేల ప్రాముఖ్యత విశిష్టత, అధిక దిగుబడి సాధనకు పాటించాల్సిన విధానాలను వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు వీఎస్ సందీప్ నాయక్, పి.జోగారావు పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ అసోసియేట్, టీచింగ్ అసిస్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధిపై నిర్లక్ష్యం



డెక్కాపురం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు



కోనాపురం రహదారి బాగు చేయాలని వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు విమర్శ

అనంతగిరి (అరకులోయ టౌన్): గిరిజనాభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు విమర్శించారు. గురువారం ఆయన కుటుంబ సమేతంగా మండలంలో పర్యటించారు. బొర్రా, డెక్కాపురం పాఠశాలల్లో మొక్కలు నాటారు. బొర్రా గుహలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత సమస్యలతోపాటు పీవీటీజీ సమస్యలను పెడచెవిన పెడుతోందన్నారు. మూడు మండలాల ప్రజలకు ఉపయోగపడే కోనాపురం రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడం దారుణమన్నారు. తక్షణమే రహదారి మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కోనాపురం రహదారి మెరుగుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గుబాయి అప్పలమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం కొండబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పంచాడి కృష్ణారావు, ఎంపీటీసీ డేనియేలు, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, గ్రామస్తులు రఘునాథ్, దొన్ను, సచివాలయం, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేదల సాగు భూములు, ఇళ్లకు పట్టాలివ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పాడేరు: రాష్ట్రంలోని పేదల ఇళ్ల భూములకు పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా, ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో వీటికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేని రైతులు వేల సంఖ్యలో ఉన్నారని, గ్రామాలు, పట్టణాల్లో కూడా ఇళ్ల పట్టాలు లేని వారు లక్షల సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం తెచ్చిన భూ దురాక్రమణ చట్టం దుర్మార్గమైనదని, పేదవాళ్లను ఖాళీ చేయించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే దురుద్దేశమే ఇందుకు కారణమని విమర్శించారు. పేదల ఇళ్లకు, భూములకు రక్షణ కల్పించి రెవెన్యూ సదస్సులో వీరికి పట్టాలు ఇవ్వాలన్నారు. చుక్కల భూముల పేరుతో రైతుల భూములకు పట్టాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్న ఘటనలపై పెండింగ్‌లో ఉన్న సుమారు 12 లక్షల మంది రైతుల దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

పీవీటీజీ గిరిజనుల పట్ల వివక్ష

అల్లూరి జిల్లాలోని 1600 గ్రామాల్లో జీవిస్తున్న పీవీటీజీ తెగ గిరిజనుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్షపాత ధోరణి అవలంభిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. 2006లో వచ్చిన అటవీ భూముల హక్కు చట్టం కింద పూర్తిస్థాయిలో పట్టాలు ఇంకా పంపిణీ కాలేదన్నారు. టైగర్ జోన్ ఎన్విరాన్‌మెంట్ పేరుతో ఇంకా గిరిజనులని పోడు భూముల నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అటవీ భూముల హక్కు పత్రాలు పంపిణీ చేయాలని కోరారు. పీఎం జన్‌మన్ పథకం కింద పీవీటీజీలకు గృహ నిర్మాణానికి మిగతా 8వ పేజీలో ▶

పేరెంట్స్, టీచర్ మీట్ రేపు

- జిల్లావ్యాప్తంగా 3,124 పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- పాఠశాలలకు స్టార్ రేటింగ్
- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన డీఈవో బ్రహ్మాజీరావు

సాక్షి, పాడేరు: జిల్లాలోని 3,124 పాఠశాలల్లో ఈనెల 7వతేదీన పేరెంట్స్ టీచర్ మీట్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశమై విద్యార్థుల విద్యా ప్రమాణాలపై చర్చిస్తారన్నారు. విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు విద్యా ప్రమాణాల మెరుగుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 99వేల మంది విద్యార్థులకు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సామర్థ్య పరీక్షలు నిర్వహించామని, 25శాతం మంది పిల్లలకు తెలుగు, ఇంగ్లీషు, గణితంలో వెనుకబడినట్టు గుర్తించామన్నారు. చదవడం, రాయలేని పరిస్థితుల వల్ల బోర్డు నిర్వహించే పరీక్షల్లో విఫలం అవుతున్నారన్నారు.జిల్లాలో 1,63,886 మంది విద్యార్థుల పేర్లను నమోదు చేశామని, వారే స్వయంగా ఆహ్వాన పత్రాలు తయారు చేసి తల్లిదండ్రులకు పంపించడం జరిగిందన్నారు. ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో విద్యార్థులకు సమగ్ర విద్యా ప్రగతితో కూడిన హోలిస్టిక్ కార్డులు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి బ్లడ్ గ్రూప్, ఎత్తు, బరువులను నమోదు చేస్తారని ఆయన తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఆయా పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇస్తామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల సలహాలు స్వీకరించి వాటిని అమలుజేసేందుకు ప్రత్యేకాధికారులను నియమిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు, పీఎంఆర్‌సీ మోనటరింగ్ అధికారి జ్ఞానప్రకాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి మనోహర్ పర్యటన

సాక్షి,పాడేరు: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 6వతేదీ శుక్రవారం పాడేరు పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మ తల్లి పాదాల గుడికి చేరుకుంటారు. మినుములూరు డీఆర్‌డిపోను తనిఖీ చేసి డ్వాక్రా మహిళలతో మాట్లాడతారు. అక్కడ నుంచి సుండ్రుపుట్టులోని డీఆర్ డిపోను సందర్శిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పాడేరు పీఎంఆర్‌సీ విలేకరుల సమావేశం నిర్వహిస్తారు.

120 కేజీల గంజాయి స్వాధీనం

- నలుగురు అరెస్ట్.. ఒకరు పరారీ



గంజాయి నిందితులతో అన్నవరం ఎస్సై వీరబాబు, పోలీసు సిబ్బంది

చింతపల్లి: అల్లూరి మన్యం నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు అన్నవరం ఎస్సై వీరబాబు తెలిపారు. గురువారం లోతుగెడ్డ వంతెన వద్ద కచ్చితమైన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేపడుతుండగా.. మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 120 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. జి. మాడుగుల మండలం చింతగుప్ప గ్రామానికి చెందిన ముగ్గురిని, చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ పరిధి లింగాలగుడి గ్రామానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.6 లక్షలు ఉంటుందన్నారు. చింతపల్లి సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

గోపాలపట్నం: హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకుండా డీలర్లు నూతన వాహనాలను డెలివరీ చేయవద్దని ఉపరవాణా కమిషనర్ జి.ఆదినారాయణ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. మోటార్ వాహన చట్టం సెక్షన్ 41(6) ప్రకారం కొత్త వాహనాలు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై తిరగడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ 2024 నవంబర్ 22న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రతి కొత్త వాహనం హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌తోనే ఉండాలని, ఈ నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ ప్లేట్ల ఖర్చును వాహన ధరలో భాగంగానే వసూలు చేసుకోవాలని డీలర్లకు సూచించారు.

మఖానా సాగుకు ప్రోత్సాహం

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్



రైతులతో ఐటీడీఏ పీవో అపూర్వభరత్, శాస్త్రవేత్తలు

చింతూరు: డివిజన్‌లోని చెరువులు, కుంటల్లో మఖానా సాగు చేపట్టేందుకు రైతులను ప్రోత్సహిస్తామని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. చింతూరు డివిజన్లో మఖానా సాగు సాధ్యా సాధ్యాలపై నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానాకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఇందుశేఖర్ సింగ్, డాక్టర్ పడాల వినోద్ కుమార్‌తో కలసి ఆయన గురువారం కూనవరం, వీఆర్ పురం మండలాల్లో పర్యటించారు. చెరువులు, కుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రస్తుతం ఈ ప్రాంతంలోని నీరు, మట్టిని తదుపరి పరీక్షల నిమిత్తం పంపడం జరిగిందని, వాటి ఫలితాలను బట్టి పైలట్ ప్రాజెక్టు కింద మఖానా సాగు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పంటలను వేసేందుకు రైతులకు ఐటీడీఏ ద్వారా అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎంతోమంది రైతులకు జీవనోపాధి లభించే అవకాశముందని పీవో పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మఖానా ప్రధానంగా నీటిలో పెరుగుతుందని, పోషక, ఔషధ విలువలు అధికంగా ఉన్నందున ఈ పంటకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో డిమాండ్ పెరిగిందన్నారు. మఖానా పంటకాలం తొమ్మిది నెలలు ఉంటుందన్నారు. ఏడాదిలో డిసెంబర్ నుంచి సెప్టెంబర్ వరకు పంట వేస్తారన్నారు. ప్రపంచంలో 90 శాతం మఖానా మనదేశంలోనే పండుతుందన్నారు.ఉత్పత్తిలో బిహార్ మొదటి స్థానంలో ఉండగా ఉత్తరప్రదేశ్, పశ్చిమబంగాల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రమే ఈ పంట సాగవుతోందని వారు తెలిపారు. పంటకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈ ప్రాంతంలో సాగు చేపట్టేందుకు పరిశీలిస్తున్నామని వారు పేర్కొన్నారు.

ఏజెన్సీలో పోస్టల్ సేవలను విస్తరించండి

కలెక్టర్ దినేష్‌కుమార్



పోస్టల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పోస్టల్ సేవలను మరింత విస్తరించాలని, కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. తన కార్యాలయంలో పోస్టల్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని, పోస్టల్‌శాఖకు అన్ని విధాల సహకరిస్తామన్నారు. జిల్లాలో అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇంకా 18వేల మందికి ఆధార్ కార్డులు జారీ చేయాల్సి ఉందన్నారు. పోస్టాఫీసుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నగదు బదిలీ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు పోస్టల్ ఖాతాలు ప్రారంభించాలన్నారు. జిల్లాలో గ్రామసడక్ సర్వే పూర్తి చేశామని, రానున్న రెండు, మూడేళ్లలో పూర్తిస్థాయిలో అన్ని మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పోస్టల్ సేవల విస్తరణకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

434 పోస్టాఫీస్‌ల ద్వారా సేవలు

కర్నూలు రీజనల్ పోస్టుమాస్టర్ జనరల్ ఉపేంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా కేంద్ర ప్రభుత్వం అనేక పోస్టల్ పథకాలను అమలు జేస్తుందన్నారు. జిల్లాలో 434 పోస్టాఫీస్‌లు ఉన్నాయని, ఖాతాదారులు ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఖాతాలను మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. కిసాన్ సమ్మాన్, సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితర అనేక సేవలు అందుబాటులో ఉన్నాయని, పోస్టల్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. అనకాపల్లి పోస్టల్ అధికారి కె.శ్రీనివాస్, పాడేరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వై.దిలీప్, సీపీవో కె.ఎస్.ఆర్.కె.పట్నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశం
- ఏరియా ఆస్పత్రి సందర్శన

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. గురువారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ భావనతో కలిసి ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డయాలసిస్ సెంటర్ ద్వారా అందుతున్న సేవలను ఆస్పత్రి ఇన్‌చార్జి నుంచి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు సోకడానికి గల కారణాలను వైద్యుల నుంచి తెలుసుకున్నారు. ఎక్కువగా నీరు తాగకపోవడం, ఉప్పు, కారం ఎక్కువగా తినిడం వల్ల కిడ్నీ వ్యాధులు సోకడానికి కారణమని వారు వివరించారు. ప్రసూతి శిశు ఆరోగ్య నూతన భవనాన్ని పీవో పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ టీవీ శేషురెడ్డి కోరారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనల సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనిమియా విభాగాన్ని పరిశీలించారు. వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీ వివరాలను పీవో తెలుసుకున్నారు. ఇన్ పేషెంట్లకు తాజా ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కుమార్, డీఈ చైతన్య పాల్గొన్నారు.

హైవేల నిర్మాణం వేగవంతం

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జాతీయ రహదారి నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు.గురువారం తన కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్లు, జాతీయ రహదారి విభాగం అధికారులతో జూమ్‌లో క్షేత్రస్థాయిలో సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిధుల కొరత లేనందున అందరికీ చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారి వల్ల భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులు జరపాలని సూచించారు. ఆర్వోఎఫ్ఆర్ భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించేందుకు సబ్ కలెక్టర్లు వెంటనే ప్రతిపాదనలు పంపిస్తే వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. భూసేకరణపై పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం సబ్‌కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రీ, జాతీయ రహదారి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

లంబసింగి–అరకు హైవే టూరిజం కారిడార్

లంబసింగి నుంచి అరకు వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి టూరిజం కారిడర్‌గా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు టూరిజం అభివృద్ధికి రూ.250 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెడుతుందన్నారు. చింతపల్లి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జాతీయ రహదారికి డీపీఆర్ పూర్తయిందన్నారు. ఈ మేరకు భూములు అప్పగించామని, ఈరోడ్డు పనులు జనవరి నాటికి ప్రారంభమయ్యే పరిస్థితి ఉందన్నారు. అంబేద్కర్ సెంటర్ నుంచి వైద్య కళాశాల వరకు ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్డును వంద అడుగులకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యూటిఫికేషన్‌కు గతంలోనే ప్రభుత్వానికి నివేదిక పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల్లో 88.70 శాతం నమోదు



మారేడుమిల్లిలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు



చింతూరులో ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్న పోలింగ్ సిబ్బంది



ఎటపాకలో ఓటింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు



గంగవరం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రంపచోడవరం: ఏజెన్సీలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల్లో 88.70శాతం పోలింగ్ నమోదు అయింది. ఎటపాక మండలంలో నూరుశాతం ఓటుహక్కును వినియోగించుకున్నారు. వై. రామవరం మండలంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఒకదానిలో నూరుశాతం పోలింగ్ నమోదైంది. కూనవరంలో 97.56, చింతూరులో 89.19, వీఆర్ పురంలో 95.65 చొప్పున మొత్తంమ్మీద 94.59శాతం నమోదు అయినట్టు అధికారవర్గాలు తెలిపాయి. రంపచోడవరం డివిజన్‌లోని మారేడుమిల్లిలో 94.59, వై.రామవరంలో 79.41, అడ్డతీగలలో 86.73, రాజవొమ్మంగిలో 79.34, గంగవరంలో 98.04, రంపచోడవరంలో 93.10, దేవీపట్నంలో 87.45 శాతం మేర ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పశ్రీ పోలింగ్ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. బ్యాలెట్ బాక్సులు రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న తరువాత గట్టి భద్రత మధ్య వాటిని కాకినాడ జేఎన్‌టీయూ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజవొమ్మంగి: స్థానిక ఎంపీపీ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కేంద్రంలో 121 మంది ఓటర్లలో 96 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని ప్రిసైడింగ్ ఆఫీసర్ చక్రధర్ తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ సన్యాసినాయుడు, సెక్టోరల్ ఆఫీసర్ రయ్యారెడ్డి పోలింగ్‌ను పర్యవేక్షించారు.

ఎటపాక: మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 10 మంది ఓటర్లకు గాను 10 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

చింతూరు: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 37కు గాను 33 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ ప్రక్రియను పోలింగ్ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 51 మందికి గాను 50 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్ఐ భూషణం పర్యవేక్షించారు. బాలింతలు పేనేటి జ్యోతి, రెడ్డి భవాని ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కూనవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 41 మందికి గాను 40 మంది ఉపాధ్యాయులు ఓటు వేసినట్టు ప్రిసైడింగ్ అధికారి రామాంజనేయ ప్రసాద్ తెలిపారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి శ్రీకాంత్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కేఆర్ విజయ పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎస్ఐ లతశ్రీ బందోబస్తు నిర్వహించారు.

అడ్డతీగల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 98 మందికి గాను 85 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వై.రామవరంలో 34కు గాను 27 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ప్రక్రియను తహసీల్దార్లు కొమరం సూర్యారావు, వేణుగోపాల్ పర్యవేక్షించారు.

నిందితురాలికి రిమాండ్

అంగన్‌వాడీ కార్యకర్త హత్యాయత్నం కేసు

సీతమ్మధార(విశాఖ): అంగన్‌వాడీ కార్యకర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో నిందితురాలిని గురువారం రిమాండ్‌కు తరలించారు. అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న రహీం మనీషా బేగంపై ఆమె స్నేహితురాలు సంగీత పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. గోపాలపట్నానికి చెందిన సంగీతను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా.. నిందితురాలు తీసుకొచ్చిన పెట్రోల్‌ను మర్రిపాలెంలోని బంక్‌లో కొనుగోలు చేసినట్టు విచారణలో తేలింది. ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పరామర్శించారు. బేగం పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

పేదల సాగు భూములు, ఇళ్లకు పట్టాలివ్వాలి

▶7వ పేజీ తరువాయి

రూ.2 లక్షలు ఇస్తే సరిపోదని రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదాని పేరు ఎత్తడానికి రాష్ట్ర ప్రభుత్వం వణికిపోతోందని, అదానీ కంపెనీ పోర్టులు, విద్యుత్, హైవేల పేరుతో రాష్ట్రాన్ని కబ్జా చేస్తోందని మండిపడ్డారు. అదానీ చేతుల్లోంచి పోర్టులకు విముక్తి కల్పించి ప్రభుత్వమే వాటిని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఉక్కు ప్రైవేటీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలి: లోకనాథం డిమాండ్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణపై విశాఖ సభలో సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంపై స్పందించి ఈ సభలో దీనిపై ఒక స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. అల్లూరి జిల్లా సీపీఎం కార్యదర్శి అప్పలనరస మాట్లాడుతూ జిల్లాలోని నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గ్రామాలను ఐదవ షెడ్యూల్‌లోకి మార్చు చేసి వాటిని రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పీసా కమిటీ ఎన్నికలు పదేళ్ల నుంచి జరగలేదని దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసభల ఆమోదం లేకుండా ఏజెన్సీలో మద్యం దుకాణాల కేటాయింపు జరిగిందని ఇది పీసా కమిటీకి విరుద్ధమన్నారు. 20 రోజులుగా దీక్షలు చేస్తున్న గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్ల పట్ల ప్రభుత్వ వైఖరి దుర్మార్గమని, వెంటనే వీరిని కాంట్రాక్ట్ టీచర్లుగా గుర్తించి రెగ్యులరైజేషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో నిర్వహించే డీఎస్సీ నుంచి ఈ పోస్టులను మినహాయించాలని ప్రభుత్వాన్ని సూచించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సురేంద్ర పాల్గొన్నారు.


భారీగా రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఖుర్దారోడ్ డివిజన్ భద్రక్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ప్రీ నాన్ ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 12న విశాఖపట్నం–ఢిఘా(22874) ఎక్స్‌ప్రెస్, 13న ఢిఘా–విశాఖపట్నం(22873) ఎక్స్‌ప్రెస్, 10, 17 తేదీల్లో షాలిమర్–విశాఖపట్నం (22853) ఎక్స్‌ప్రెస్, 11,19వ తేదీల్లో విశాఖపట్నం–షాలిమర్(22854) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. 14న హౌరా–తిరుపతి(20889) ఎక్స్‌ప్రెస్, 15న తిరుపతి–హౌరా (20890) ఎక్స్‌ప్రెస్, 10, 13, 17వ తేదీల్లో తిరుచ్చిరాపల్లి–హౌరా(12664) ఎక్స్‌ప్రెస్, 12, 15, 19వ తేదీల్లో హౌరా–తిరుచ్చిరాపల్లి(12663) ఎక్స్‌ప్రెస్, 10, 13, 17వ తేదీల్లో సంత్రగచ్చి–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(22807) ఎక్స్‌ప్రెస్, 12, 15, 19వ తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సంత్రగచ్చి(22808) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి. 14న కన్యాకుమారి–హౌరా(12666) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 16న హౌరా–కన్యాకుమారి(12665) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 8, 15వ తేదీల్లో హౌరా–పుదుచ్చేరి(12867) ఎక్స్‌ప్రెస్, 11, 18వ తేదీల్లో పుదుచ్చేరి– హౌరా(12868) ఎక్స్‌ప్రెస్, 15న సంత్రగచ్చి–తిరుపతి(22855) ఎక్స్‌ప్రెస్, 16న తిరుపతి–సంత్రగచ్చి (22856) ఎక్స్‌ప్రెస్, 10, 17వ తేదీల్లో షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(22825) ఎక్స్‌ప్రెస్, 11,18వ తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–షాలిమర్(22826) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు డీసీఎం సందీప్ తెలిపారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు : పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఆయా తేదీల్లో అదనపు కోచ్‌లను జతచేస్తున్నారు. సంబల్‌పూర్–ఈరోడ్(08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 11 నుంచి 25వ తేదీ వరకు, ఈరోడ్–సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 13 నుంచి 27 వరకు థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు. శ్రీకాకుళం–కొల్లాం(08553) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8 నుంచి 29వ తేదీ వరకు, కొల్లాం–శ్రీకాకుళం (08554) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 9 నుంచి 30వ తేదీ వరకు స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నారు.

ఏయూ పరీక్షల్లో గందరగోళం

- బీఎస్సీ ఫుడ్ సైన్స్ ప్రశ్నాపత్రంపై అభ్యంతరం
- మళ్లీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు



ఏయూలోని పరీక్షల విభాగం కార్యాలయం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఎస్సీ హానర్స్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సు పరీక్ష గందరగోళంగా మారింది. బుధ, గురువారాల్లో బీఎస్సీ హానర్స్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సు మూడో సెమిస్టర్ పరీక్ష జరిగింది. అయితే ప్రశ్నాపత్రం తయారీలో తప్పిదాలు చోటు చేసుకున్నాయి. వర్సిటీ నిర్దేశించిన సిలబస్ కాకుండా.. ప్రశ్నాపత్రంలో సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చాయి. దీంతో పరీక్ష సరిగ్గా రాయలేకపోయామని విద్యార్థులు.. ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ దృష్టికి తీసుకురాగా.. వారు ఏయూ అధికారులను సంప్రదించారు. దీనిపై స్పందించిన ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సంబంధిత ప్రశ్నాపత్రాన్ని పరిశీలించారు. ప్రశ్నాపత్రంలో నిజంగానే సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చాయా అనేది పరిశీలన చేయాలని సంబంధిత సబ్జెక్టు నిపుణులను ఆదేశించారు. వాటిని పరిశీలించిన పరీక్షల విభాగం అధికారులు అది వాస్తవమేనని తేల్చడంతో వర్సిటీ అధికారులు తేరుకున్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఈ నెల 12,13 తేదీల్లో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు ప్రకటించారు. విద్యార్థులు ఆ రోజు మళ్లీ పరీక్షకు హాజరై రాయవచ్చన్నారు. సిలబస్ లేకుండా ప్రశ్నాపత్రాలు తయారు చేసి, విద్యార్థులను ఆందోళనకు గురి చేసిన వర్సిటీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తొలి గురువారం.. పోటెత్తిన భక్తజనం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

నేటి కార్యక్రమాలు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సర్వ దర్శనం, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వ దర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించనున్నారు.

దాబాగార్డెన్స్(విశాఖ): మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో తొలి గురువారం పూజలు వైభవంగా జరిగాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వెండి కవచాలు తొడిగారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో కె తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శనాలు ఇలా..

టౌన్‌కొత్తరోడ్డు నుంచి క్యూలు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మ దర్శనంతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనం, రూ.200 శీఘ్ర దర్శనం, రూ.500 మార్గశిర విశిష్ట దర్శనం కల్పించారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లల తల్లులకు పంపించారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం కార్యాలయం ఎదురుగా దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఘోషాస్పత్రి వద్ద అగ్నిమాపక యంత్రం, రీడింగ్ రూమ్ వద్ద మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచారు. ఆలయానికి సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం అందజేశాయి. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఐదు వేల మందికి అన్నదానం

ఉత్సవాల్లో భాగంగా టౌన్‌కొత్తరోడ్డు సమీపంలోని జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. ఐదువేల మంది భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల సౌకర్యార్థం సింహాచలం, మధురవాడ నుంచి రెండు సర్వీసులు నడిపినట్టు ఈవో తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా జగదాంబ జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్ మీదుగా పాతపోస్టాఫీస్ వెళ్లే వాహనాలను టౌన్‌కొత్తరోడ్డు, సీబీఎం హైస్కూల్, సూయిజ్‌ఫాం, కురుపాం మార్కెట్ మీదుగా మళ్లించారు. కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వాహనాలను గోపాల్ ఆటో జంక్షన్ మీదుగా మళ్లించారు.

పోలీసుల తీరుపై ఆరోపణలు

మార్గశిర మాసం తొలి గురువారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు దేవస్థానం పోలీసుల సాయం కోరింది. దీంతో ఆలయం చుట్టూ వందలాది మంది పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, భక్తులు అక్రమ మార్గాల్లో వెళ్లకుండా నియంత్రించే క్రమంలో కొంతమంది పోలీసులు తమ కుటుంబ సభ్యులను, బంధువులను అనుమతించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే జనసేన, టీడీపీ చోటా నాయకులు హడావిడి చేస్తూ అంతా తామేనన్నట్లు వ్యవహరించారు. వారి తీరుతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.